## నేడు భూసార బీట్ బంద్

భైంసా, మార్చి 28: వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం భూసార బీట్ బంద్ ఉంటుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత కార్యదర్శి అడెల్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుడ్ ఫ్రై డే సందర్భంగా మార్కెట్ కార్యాలయానికి సెలవు ఉండడంతో భూసార బీట్‌ను తాత్కాలికంగా బంద్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని రైతులు, కమిషన్ దారులు, ఖరీదు దారులు గమనించి సహకరించాలని కోరారు.

## ఎన్నికల నియమావళి పాటించాలి

కుంటాల, మార్చి 28: ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని ఉమ్మడి కుంటాల మండల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీమ్ లీడర్, ఎంపీడీవో అబ్దుల్ రహీం అన్నారు. ప్రార్థనా మందిరాలు, ప్రభుత్వ భవనాలు లాంటి ప్రదేశాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించకూడదని, వ్యక్తిగత జీవితాన్ని హరించే దూషణలు, ఆరోపణలకు దూరంగా ఉండాలని రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సూచించారు. అనుమతి లేనిదే ప్రచార సామగ్రిని గ్రామాల్లో ఏర్పాటు చేయకూడదని ఒక ప్రకటనలో కోరారు.

## ఒకరికి జైలు

కడెం, మార్చి 28: మండలంలోని బెల్లాల్ ఎక్స్ రోడ్డు వద్ద ఐచర్ వాహనంతో ప్యాసింజర్ ఆటోను ఢీకొట్టిన ఒకరికి జైలు శిక్ష విధించినట్లు కడెం ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 2020 అక్టోబర్ 20వ తేదీన ఐచర్ వ్యాన్(ఏపీ 25 ఎక్స్ 7518) ప్యాసింజర్ ఆటోను ఢీకొంది. సోన్ మండలంలోని కూచన్‌పెల్లి గ్రామానికి చెందిన పూదరి రాజశేఖర్ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ కేసు నమోదు చేయగా, అప్పటి కడెం ఎస్ఐ కోదాడి రాజు దర్యాప్తు చేసినట్లు తెలిపారు. కడెం మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన నీరటి రాజేందర్‌కు 5 నెలల జైలు, రూ. 1500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు ప్రస్తుత కడెం ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.

## 20 మంది విద్యార్థుల గైర్హాజరు

నిర్మల్ అర్బన్, మార్చి 28: నిర్మల్ జిల్లాలో గురువారం 47 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పదో తరగతి జీవ శాస్త్రం పరీక్షకు 20 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో రవీందర్ రెడ్డి తెలిపారు. జిల్లావ్యాప్తంగా 8923 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 8903 మంది హాజరైనట్లు చెప్పారు.

## చలివేంద్రం ఏర్పాటు

దస్తురాబాద్,మార్చి28 : మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని గురువారం అధికారులు, సిబ్బంది,ప్రజలతో కలిసి ఎంపీడీవో రమేశ్ ప్రారంభించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఈ చలి వేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఎంపీవో అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కరపత్రాల విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్ననాయకులు

ఖానాపూర్ రూరల్, మార్చి 28: పెరిగిన కరువు భత్యం అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సునారికారి రాజేశ్ అన్నారు. బీర్నంది గ్రామంలో గురువారం కరపత్రాలు విడుదల చేశారు. పెరిగిన కరువు భత్యం జీవోను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బీడీలు చుట్టే కార్మికులందరికీ ఒకే విధంగా వేతనాలు చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి లింగన్న, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి పరామర్శ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఖానాపూర్, మార్చి 28: పట్టణంలో ఓ నిరుపేద కుటుంబాన్ని బుధవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పరామర్శించారు. శాంతినగర్ ఎస్సీ కాలనీకి చెందిన కొమిరె రాజు, నడ్పి రాజన్న దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఓ కుమారుడు విజిట్ వీసాపై గల్ఫ్ బాట పట్టగా అక్కడ సరైన ఉపాధి లేక ఖాళీగా ఉంటున్నాడు. మరో కుమారుడు కూలీగా పనిచేస్తూ తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. కూతుళ్లకు వివాహం జరిగినప్పటికీ, కుటుంబ తగాదాలతో పుట్టింటికే చేరారు. అప్పులు తీవ్రం కావడంతో ఉన్న పూరి గుడిసెను తాకట్టు పెట్టి పట్టణ శివారులోని ఓ మామిడి తోటలో జీతం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ విషయం పలు పత్రికల్లో రావడంతో మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం, స్థానిక నాయకులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి, రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. రాజన్న కుమారుడు వరుణ్‌కు అయ్యే వైద్య ఖర్చులు, ప్రభుత్వ పరంగా వచ్చే సదుపాయాలు కల్పిస్తామని బాధిత కుటుంబానికి భరోసా కల్పించారు. ఎమ్మెల్యే కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు దయానంద్, రమేశ్, శంకర్, గంగాధర్ తదితరులున్నారు.

## ప్రసవానంతర సేవలపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యురాలు ఫిర్దోస్ జబీన్

భైంసా, మార్చి, 28: పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో మహిళలకు గురువారం ప్రసవానంతర సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు ఫిర్దోస్ జబీన్ మాట్లాడుతూ ఆపరేషన్ అయిన ప్రాంతంలో విపరీతమైన నొప్పి, జ్వరం, చీముతో కూడిన స్రవాలు, చలితో కూడిన జ్వరం, పొత్తి కడుపులో నొప్పి తదితర లక్షణాలు కనబడితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు అసంకల్పితంగా కొద్ది మోతాదులో ఇబ్బందులు ఏర్పడితే కూడా వైద్యులను సంప్రదించాలని సూచించారు. సీహెచ్‌వో గిరిబాబు, గంగన్న, హెల్త్ అసిస్టెంట్ నరేశ్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులున్నారు.

# వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

- తాగునీటి పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేయాలి
- కుంటాల మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ గజ్జారాం
- గైర్హాజరైన అధికారులపై మండిపాటు, కలెక్టర్‌కు ఫిర్యాదు



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ అప్క గజ్జారాం, అధికారులు

కుంటాల, మార్చి, 28: వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులను మండల సర్వ సభ్య సమావేశంలో ఎంపీపీ గజ్జారాంతో పాటు సభ్యులు కోరారు. కుంటాల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. వేసవి దృష్ట్యా అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు నివారించడానికి తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అటవీ అధికారి రేష్మ తెలిపారు. నీటి వసతి ఉన్న చోట నర్సరీ ఏర్పాటు చేసుకోవాలని ఎంపీపీ సూచించారు. హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్ ఆరోగ్య నివేదికను చదివి వినిపించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయాధికారి సోమలింగా రెడ్డి పంటల వివరాలను వెల్లడించారు. తహసీల్దార్ ఎజాజ్ ఖాన్ ప్రజా పంపిణీ వ్యవస్థపై సభకు నివేదించారు. విట్టాపూర్, మెదన్‌పూర్, తదితర గ్రామాల్లో కొత్త రేషన్ షాపుల కోసం ఆర్డీవోకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. దౌనెల్లి తండాలో కూడా ఒక షాపు ఏర్పాటు చేయాలని కో ఆప్షన్ సభ్యుడు గౌస్ కోరగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు గృహజ్యోతి పథకం కింద 5690 మంది వినియోగదారులు అర్హత పొందగా, 5610 మందికి జీరో బిల్లులు ఇచ్చామని విద్యుత్ శాఖ ఏఈ శివ ప్రసాద్ తెలిపారు. ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను వినిపించారు. సమావేశానికి గైర్హాజరైన అధికారుల వివరాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీడీవో రహీంకు సూచించారు. వైస్ ఎంపీపీ పసుల మౌనిక, అధికారులు, ఎంపీటీసీలు, కట్ట రవి, సుధాకర్, కోఆప్షన్ సభ్యుడు గౌస్, ఎంపీడీవో రహీం, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఉన్నారు.



తాగునీటి సౌకర్యం కల్పిస్తున్న అధికారులు

# వన్యప్రాణులకు నీటి సౌకర్యం

కుంటాల, మార్చి 28 : పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్ చెప్పారు. దౌనెల్లి అటవీ ప్రాంతంలో ఉన్న చిన్న కుంటను నీటితో నింపారు. ఎఫ్‌బీవో స్రవంతి, వాచర్లు ఉన్నారు.



స్త్రీ నిధి రికవరీ మొత్తాన్ని డీఆర్డీవో విజయలక్ష్మికి అందజేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

# నష్టం జరగకుండా చూడాలి

- డీఆర్డీవో విజయలక్ష్మి

కుంటాల, మార్చి, 28: కూలీలకు నష్టం జరగకుండా వేతనాలు కొలతల ప్రకారం చెల్లించాలని డీఆర్డీవో విజయ లక్ష్మి సూచించారు. కుంటాల మండల కేంద్రంలోని రైతు వేదిక హాలులో లోకేశ్వరం, నర్సాపూర్, కుంటాల, కుభీర్, భైంసా, ముథోల్, బాసర, తానూర్ మండలాలకు చెందిన ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం గురువారం ఆమె నిర్వహించారు. కూలీల నివేదిక, నర్సరీలు, బోర్‌వెల్, ఇతర నిర్మాణాల పనులపై సమీక్షించారు. హెచ్‌ఆర్ మేనేజర్ సుధాకర్, డీఆర్పీ గంగాప్రసాద్, ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు. మండల కేంద్రంలోని శానిటరీ న్యాప్కిన్ తయారీ కేంద్రాన్ని డీఆర్డీవో విజయలక్ష్మి సందర్శించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సిబ్బందికి సూచించారు. దీంతో పాటు మండల కేంద్రంలో వీవోలకు పొదుపు, రికవరీలపై అవగాహన కల్పించారు. రెండు సంఘాల ద్వారా రికవరీ చేసిన రూ. 1,06,000 నగదును డీఆర్డీవోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం అశోక్, సిబ్బంది ఉన్నారు.

**కడెంలో..**

కడెం, మార్చి 28: ప్రతి గ్రామ పంచాయతీలో కూలీలకు ఉపాధి హామీ పని కల్పించాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. కడెం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కడెం, ఖానాపూర్, పెంబి, దస్తురాబాద్ మండలాలకు చెందిన ఏపీవో, టీఏ, ఎఫ్ఏ, ఈసీలతో సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈ వేసవిలో ప్రతి గ్రామ పంచాయతీలో కూలీలకు కనీసం 400 మందికి ఉపాధిహామీ పనిని కల్పించాలని ఆదేశించారు. ప్రతి కూలీకి వంద రోజుల పనిని కల్పించడం, వేతనాలను కూడా వారి ఖాతాల్లో వెంటనే జమ చేసేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. కూలీలకు పని కల్పించడంలో సిబ్బంది నిర్లక్ష్యం చేస్తూ వారిని ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. కడెం ఏపీవో జయదేవ్, నాలుగు మండలాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# క్షయ నిర్మూలనకు కృషి చేయాలి

ముథోల్, మార్చి, 28 : క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ విజయానంద్ అన్నారు. ముథోల్‌లోని ప్రభుత్వ దవాఖానలో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధిపై అపోహలు ఉండవద్దని సూచించారు. తప్పనిసరిగా వైద్యం చేసుకుంటే నిర్మూలన సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో డా. సాయి సువర్ధన్, రాహుల్, టీబీ సూపర్‌వైజర్ లాలయ్య, నర్స్ పద్మ, తదితరులున్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

## సేవ చేయాలనే తపన ఉండాలి

దస్తురాబాద్,మార్చి 28 : బాల్యం నుంచే సామాజిక సేవ చేయాలనే తపన ఉండాలని శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ కోట సాయి కృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రజల వద్ద నుంచి విరాళాలు సేకరించారు. మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లోని శ్రీ సత్య సాయి వృద్ధాశ్రమానికి రూ. 12,924 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వారు 21 మంది విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్‌ను అందజేశారు. విద్యార్థులను ట్రస్ట్ సభ్యులు అభినందించారు.

## బేలలో కవాతు

జైనథ్(బేల), మార్చి 28 : ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు బేల మండల కేంద్రంలో గురువారం పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వీధుల గుండా కవాతు నిర్వహించారు. రాబోయే లోక్ సభ ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా ఎన్నికల్లో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకోవాలని బేల ఎస్ఐ రాధిక సూచించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ ఎస్ఐ పురుషోత్తం, పోలీసులు పాల్గొన్నారు.



బేలలో పోలీస్ కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

# బార్ అసోసియేషన్ కార్యవర్గాల ఎన్నిక



నిర్మల్‌లో బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సభ్యులు



భైంసాలో అధ్యక్షుడిని సత్కరిస్తున్న న్యాయవాదులు

నిర్మల్ అర్బన్, మార్చి 28: నిర్మల్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా అల్లూరి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వోస మహేందర్, ఉపాధ్యక్షురాలిగా కవిత రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ముత్తన్న, కోశాధికారిగా నర్సారెడ్డి, క్రీడా సాంస్కృతిక కార్యదర్శిగా వంశీ కృష్ణ, గ్రంథాలయ కార్యదర్శిగా అర్చన ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఘనంగా సన్మానించారు.

**ప్రశాంతంగా ఎన్నికలు**

బార్ అసోసియేషన్ ఎన్నికలను గురువారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ప్రశాంతంగా నిర్వహించారు. సభ్యులందరూ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కేవలం ప్రధాన కార్యదర్శి పదవికి ఇద్దరు తలపడగా, ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడితో పాటు మిగతా కార్యవర్గ సభ్యులంతా ఇదివరకే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**భైంసా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా..**

భైంసా, మార్చి 28: భైంసా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గురువారం సీ శంకర్ ఎన్నికయ్యారు. అధ్యక్షుడి స్థానం కోసం పోటీపడిన మునీర్‌కు 16, సీ శంకర్‌కు 40 ఓట్లు వచ్చాయి. దీంతో అధ్యక్షుడిగా సీ శంకర్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా పోటీ పడిన దేవిదాస్‌కు 23, కుంట కీర్తికి 33 ఓట్లు వచ్చాయి. దీంతో కుంట కీర్తి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా జాకీ, కోశాధికారిగా మాధవి, కార్యదర్శిగా సందీప్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు పూలమాల శాలువాతో అధ్యక్షుడిని సత్కరించారు.

# కూలీల సంఖ్యను పెంచాలి

- ఎంపీడీవో రమేశ్



మాట్లాడుతున్న ఎంపీడీవో రమేశ్

దస్తురాబాద్, మార్చి 28: ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో రమేశ్ సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనికి వచ్చిన ప్రతి కూలీకి 100 రోజుల పని దినాలను కల్పించాలని ఆదేశించారు. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కూలీలు పని చేసే విధంగా చూడాలన్నారు. అలాగే గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

దస్తురాబాద్, మార్చి 28: గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యురాలు చందన అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం అమ్మకోసం అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులకు ఆరోగ్య సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వైద్యురాలు మాట్లాడుతూ తల్లులు ఆరోగ్యంగా ఉంటేనే పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. తల్లితో పాటు పిల్లలు కూడా పౌష్టికాహారం తీ తీసుకోవాలని కోరారు. వ్యాయామం, నడక అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో వేణు గోపాల్, హెచ్‌వీ లలిత, సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

# మట్కా జూదరుల అరెస్ట్

భీంపూర్, మార్చి 28 : భీంపూర్ ఎస్ఐ ప్రదీప్‌కుమార్ సిబ్బందితో గురువారం పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో సరిహద్దు గోవింద్‌పూర్ వద్ద ముగ్గురు మట్కా జూదరులను పట్టుకున్నారు. వీరిలో మహారాష్ట్ర కిన్వట్ తాలూకా పాటొదకు చెందిన భగత్ జైపాల్, భీంపూర్ మండలం కామట్‌వాడకు చెందిన కరాడే సౌరభ్, బేల్సరి రాంపూర్‌కు చెందిన సిడాం జంగు ఉన్నారు. వీరి నుంచి రూ.3240, 3 మట్కా చీటీల బుక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.




గోదావరి నుంచి తీసుకువచ్చిన చేపలను విక్రయిస్తున్న మత్స్యకారులు

# సేద్యానికి ఊతం .. ఉపాధికి మార్గం

- అనేక కుటుంబాలకు ఆధారం గోదావరి తీరం
- ఇక్కడి చేపలే ఇతర రాష్ట్రాలకు విక్రయం

దిలావర్‌పూర్, మార్చి 28: మానవ నాగరికతకు పుట్టినిట్లు గోదావరి తీరం.. ఉపాధి మార్గాలకు వేదికగా మారి వందలాది కుటుంబాలకు చేయూతనిస్తున్నది. జిల్లాలో గోదావరి దాదాపు 100కి.మీటర్ల విస్తీర్ణం వరకు ప్రవహించడంతో నదీ తీర గ్రామాల్లో సాగునీరు, మత్స్య సంపదకు కొదవలేకుండా పోయింది. కులవృత్తులను నమ్ముకొని జీవిస్తున్న మత్స్యకారులు, వ్యవసాయం చేసే చిన్న సన్నకారు కుటుంబాలు ఇలాంటి ఉపాధిని సద్వినియోగం చేసుకుంటున్నాయి. దిలావర్‌పూర్ మండలంలోని శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ అతి సమీపంలో ఉండడంతో నర్సపూర్(జీ), టెంబుర్ని, సముందర్‌పల్లి, కాండ్లీ, దిలావర్‌పూర్, బన్సపల్లి, లోలం, సాంగ్వీ, లోకల్ వెల్మల్ గ్రామాల్లోని రైతు కుటుంబాలు, మత్స్యకార కుటుంబాలకు ఉపాధితో పాటు ఆర్థికాభివృద్ధికి దోహద పడుతున్నది.

**ఇతర రాష్ట్రాలకు ఎగుమతి**

నిర్మల్ జిల్లాలో గోదావరి బాసరలో ప్రవేశించిన తర్వాత శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వరకు అనేక వంకరలతో పరుగులు తీస్తున్నది. ప్రతి సంవత్సరం వానకాం రాగానే ఈ ప్రాజెక్ట్ నిండుకుండలా మారుతున్నది. ఈ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌తో జిల్లాలోని సోన్, నర్సాపూర్(జీ),దిలావర్‌పూర్, నిర్మల్ మండలాల మత్స్యకారులకు చేపల వేటకు ఇది అండగా నిలిచింది. ఈ గోదావరి నిర్మల్ జిల్లాలో ప్రవహించడంతో దాదాపు 12వేల కుటుంబాలకు పైగా మత్స్యకారులు చేపల వేటతో ఉపాధి పొందుతూ ఆర్థికంగా బలోపేతమవుతున్నారు. ఇక్కడి మత్స్యకారులు వేటకు వెళ్లినప్పుడు తీసుకవచ్చిన చేపలను మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు విక్రయిస్తున్నారు. శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్‌తో పలు మండలాల వద్ద భూగర్భజలాలు పెరడగంతో మండుటెండల్లో సైతం పంటలను సాగు చేస్తున్నారు. పంటల సాగులో ఇతర జిల్లాలతో పోటీ పడుతున్నారు. ఈ పరీవాహక ప్రాంతంలో ఎక్కువ మంది రైతులు పసుపు, వరి, మక్క, ఆరుతడి పంటలను పండించి శ్రమకు తగిన ఫలితాన్ని పొందుతున్నారు. వేసవి కాలం వచ్చిందంటే చాలు ఈ నదిలో నుంచి రైతులు నల్లరేగడి మట్టిని తరలించి సాగులో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఇలా గోదావరి తీరం ఈ పరిసర ప్రాంతం ప్రజలకు రైతులు మత్స్యకారులకు ఉపాధి మార్గం చూపిస్తున్నది.



### రోజూ చేపల వేటకు వెళ్తా..

నేను పాత ఊరులో ఉన్నప్పటి నుంచే చేపల వేటకు వెళ్లేటోన్ని. మా ఊరు శ్రీరాంసాగర్ పాజెక్ట్‌లో మునిగిపోయింది. మా పాత ఊరుకు దగ్గరనే మాకు అప్పట్లో జాగ సూపించిండ్రు. ప్రాజెక్ట్ వెనుక భాగం మేము ఉండే ఊరుకు దగ్గరలోనే ఉంటుంది. రోజూ ఉదయం చేపల వేటకు వెళ్తాను. మంచిగనే జిమ్మలు పడుతాయి. రోజుకు రూ.300 నుంచి రూ. 400 వరకు జిమ్మలు అమ్ముకుంటా. బాగా వానలు పడినప్పుడు గోదావరి నిండుగా ఉంటది. అప్పుడు చేపల వేటకు వెళ్లను. అప్పుడు మా ఇంట్లో ఉన్న అట్టి జిమ్మలను అమ్ముకుంటా. మా ఊరుకు దగ్గర ఉండడంతో మంచిగనే ఉపాధి దొరుకుతున్నది.

**-గంగన్న, మత్స్యకారుడు నర్సాపూర్(జీ)**

### చేపల వేటకు వెళ్లడం ఇష్టం

మా ఊరు లోలం. నాకు చిన్నప్పటి నుంచి చేపల వేటకు వెళ్లడం అంటే ఇష్టం. మా ఊ రుకు 8కిలో మీటర్ల దూరంలో శ్రీరాంసాగర్ గోదావరి ఉన్నది. రోజూ చేపల వేటకు వెళ్తా. మా తండ్రి నుంచి నాకు ఈ వృత్తి వచ్చింది. రోజూ వేటకు వెళ్తే ఓ నాలుగైదు వందలు సంపాదిస్తా. అదృష్టం మంచిగ ఉన్న రోజు పెద్ద చేపలు పడితే వ్యాపారులకే అమ్ముత. గోదావరితోనే మాకు ఉపాధి. ముఖ్యంగా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఉచిత చేప పిల్లలు వదలడం మాకు ఎంతో మేలు చేసింది.

**-తోపారం బుచ్చన్న, లోలం మత్స్యకారుడు**

